క్లుప్తంగా

ఫిజియోథెరపీతో ఉపశమనం



స్విమ్స్‌లో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ కార్యక్రమంలో వైద్యులు

తిరుపతి తుడా : శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఫిజియోథెరపీ కాలేజీ ఆధ్వర్యంలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని బుధవారం స్విమ్స్ ఓపీడీ బ్లాక్ లోని శ్రీ పద్మావతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. స్విమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఫిజియోథెరఫీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె. మాధవి మాట్లాడారు. కొన్ని సమస్యలకు మాత్రలు, మందులతో పరిష్కారం లభించదని, ఫిజియోథెరపీతో చాలా వరకు ఉపశమనం కలుగుతుందని కీళ్ల నొప్పులు, మెడ నొప్పి, నడుము నొప్పి గురించి ఉదహరించారు. ఇవి రావడానికి కారణాలను తెలియజేశారు. వీటికి శాశ్వత పరిష్కారం ఫిజియోథెరపీతోనే సాధ్యమని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు దసరా సంబరాలు



దసరా సంబరాలలో అధ్యాపకులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ బీఈడీ కళాశాలలో బుధవారం ముందస్తు దసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి జానకిరామయ్య మాట్లాడుతూ, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. వర్సిటీ విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు, సుఖ సంతోషాలతో నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంధ్య, సుబ్రహ్మణ్యం, ప్రగతి, అనసూయమ్మ, శకుంతల, మల్లికార్జునరెడ్డి, దస్తగిరి, జయచంద్ర, కవిత, భార్గవి, భాస్కర్ నాయుడు, బోధనేతర సిబ్బంది గండికోట నాగ వెంకటేష్, మధు బాబు, మునుస్వామి, శ్రీరాములు, దొరబాబు, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

కోర్టు వద్ద న్యాయవాదుల నిరసన

తిరుపతి లీగల్ : తిరుమల శ్రీవారి లడ్డూ నెయ్యి కల్తీకి పాల్పడ్డ దోషులను గుర్తించి ప్రభుత్వం వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర న్యాయవాద పరిషత్ ప్రధాన కార్యదర్శి వజ్రాల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం కోర్టుల ప్రధాన ద్వారం వద్ద న్యాయవాద పరిషత్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. 'టీటీడీని రక్షించండి–దోషులను శిక్షించండి' అంటూ నినాదాలు చేశారు. సేవ్ టీటీడీ అంటూ బ్యానర్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గురుప్రసాద్, మధుసూదన్‌రావు, నారాయణ, రాజశేఖర్, శేఖర్, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న కందాటి శంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

తిరుపతి కల్చరల్: మున్సిపల్ మాజీ చైర్మన్ కందాటి శంకర్‌రెడ్డి జయంతి పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం రుయా ఆసుపత్రి వద్ద పేదలకు అన్నదానం చేశారు. తొలుత ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కందాటి సురేష్‌రెడ్డి, కందాటి మిథున్‌రెడ్డి, అభిమానులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జి

పాకాల: మండలంలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలతో పాటు పాఠశాలల్లోని మౌలిక వసతుల వివరాలను కూడా యూ డైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఎంఈఓ బాబ్జి ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. స్కూళ్లలో టీచర్ పోస్టులు ఎన్ని ఉన్నాయి? విద్యార్థులు ఎంత మంది? తరగతి గదులు ఎన్ని? మరుగుదొడ్లు ఎన్ని?.. ఇలా అన్నింటినీ నమోదు చేయాలన్నారు. ఎంఈఓ–2 లింగయ్య మాట్లాడుతూ, విద్యార్థుల పరీక్షల తాలూకు జవాబు పత్రాలను దిద్ది ఫలితాలను ఆన్‌లైన్ చేయాలని కోరారు. స్కూళ్ల మరుగుదొడ్లను రోజూ నాలుగు సార్లు శుభ్రం చేయాలని గుర్తు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ గెలుపే లక్ష్యం

- కూటమి నేతల ఎత్తుగడలను తిప్పికొడదాం
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించుకుందాం
- మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యే భూమన



కార్పొరేటర్లతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

తిరుపతి మంగళం : తిరుపతి కార్పొరేషన్ కార్పొరేటర్లు 30మంది జగనన్నకు అండగా, వెన్నంటే ఉండడం అభినందనీయమని మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. తిరుపతి కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్న కార్పొరేటర్లు బుధవారం తిరుపతి పద్మావతిపురంలోని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నివాసానికి వెళ్లి తొలుత ఆయన ఆశీస్సులు పొందారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను బలపరుస్తున్న కార్పొరేటర్లతో భూమన, నారాయణస్వామి, మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. నారాయణస్వామి మాట్లాడుతూ, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ఫ్యాను గుర్తుతో, జగనన్న అండతో గెలిచిన ఎంతో మంది మేయర్లు, కార్పొరేటర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు వారి స్వార్థం కోసం పార్టీలు మారుతున్నారని, అయితే తిరుపతిలో కూటమి నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా జగనన్నపై అభిమానం, కరుణాకరరెడ్డి నాయకత్వంపై నమ్మకంతో పార్టీని వీడక కార్పొరేషన్ ఎన్నికల్లో తమ అభ్యర్థులను బలపరుస్తుండడం అభినందనీయమన్నారు. భూమన మాట్లాడుతూ, కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఎన్ని ఎత్తుగడలు వేసినా చిత్తు చేయడానికి కార్పొరేటర్లంతా సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ తరపున పోటీలో ఉన్న ఐదుగురు కార్పొరేటర్లను గెలిపించుకుని జగనన్నకు తొలి కానుకగా ఇద్దామన్నారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ, తమకు మేయర్‌గా, కార్పొరేటర్లుగా గుర్తింపునిచ్చిన జగనన్న, కరుణన్న రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని, కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుని సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో నమూనా బ్యాలెట్‌లో ఓటరు మార్క్‌ను ఏ విధంగా చేయాలో కార్పొరేటర్లకు భూమన అభినయ్ వివరించారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వీరే..!

తిరుపతి కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలలో అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కార్పొరేటర్లు కోటూరు ఆంజనేయులు, డి.శాలిని, మోహన్ కృష్ణ, పి.సునీత, టి.భాస్కర్ రెడ్డి భూమన ఆశీస్సులు పొందిన అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయానికి వెళ్లారు. సమావేశంలో కార్పొరేటర్లు ఉమ అజయ్, పుల్లూరు అమర్‌నాథ్ రెడ్డి, కేతం జానకి రెడ్డి, తిరుపతి మునిరామిరెడ్డి, ఓ.బాబు, కోటూరు ఆంజనేయులు, తూకివాకం శాలిని రెడ్డి, మోహన్‌కృష్ణ యాదవ్, రత్న యాదవ్, ఆరణి సంధ్య, ఈశ్వరి, పైడి సునీత, రామస్వామి వెంకటేశ్వర్లు, తాజిన్ ఉదయ్ వంశీ, మనోహర్ ఆదిలక్ష్మి, శ్రావణి, పసల గీత, పుణీత బొగ్గుల, లడ్డు భాస్కర్, స్రవంతి, రాణి పెంచలయ్య, కోటేశ్వరమ్మ, బోకం అనిల్, ఈ.సులోచన, ఎం.శేఖర్ రెడ్డి,అనిష్ రాయల్ పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్స్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న హమాలీ కార్మికులు

తిరుపతి కల్చరల్: సివిల్ సప్‌లెస్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ రేట్లు పెంచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హమాలీలకు కూలీ రేట్లు పెంచి అరియర్స్‌తో కలిపి జీఓ విడుదల చేయాలని, రూట్ అఫ్టిమేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కార్మికులు సివిల్ సప్‌లెస్ గోడౌన్ వద్ద నల్లరిబ్బన్లు ధరించి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ, కార్మికులకు పాత అగ్రిమెంట్ ముగిసి 9 నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇంత వరకు కొత్త అగ్రిమెంట్ చేయలేదని ధ్వజమెత్తారు. జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్నారని, కొత్తగా చేరిన హమాలీలకు పీఎఫ్ కార్డులు ఇవ్వడానికి కూడా డీఎం నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రశ్నిస్తే డీటీలపై నెపం నెడుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో డీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎన్‌డీ.రవి, సివిల్ సప్లై నాయకులు చెంచు కృష్ణయ్య, ముత్తు, పళని, శేషాద్రి, గణేష్, కార్మికులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కామ్రేడ్ బర్ధన్



బర్ధన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ, ప్రజా సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్: ప్రముఖ కార్మిక వర్గ నేత బహుముఖ ప్రజ్ఞాశాలి, రాజకీయ దురంధరుడు కామ్రేడ్ ఏపీ.బర్ధన్ అని ఎస్వీయూ విశ్రాంతాచార్యులు రాజశేఖర్ కీర్తించారు. కామ్రేడ్ బర్ధన్ శత జయంతి సందర్భంగా బుధవారం సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి మాట్లాడారు. బర్ధన్ నిరాడంబర జీవితాన్ని కొనసాగిస్తూ విలువలతో కూడిన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో తనదైన ముద్ర వేశారని, ఆయన జీవితం ఇప్పటి కమ్యూనిస్టులకు ఆదర్శప్రాయమని ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు ఎ.రామానాయుడు, చిన్నం పెంచలయ్య, టి.జనార్ధన్, రాధాకృష్ణ, జె.విశ్వనాథ్, ఎన్‌డీ.రవి, రామకృష్ణ, శివ, కేవై.రాజా, అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షుడు కె.వెంకటరమణ, వివిధ ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

చెకుముకి టెస్ట్‌కు స్పందన



చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు రాస్తున్న విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను బుధవారం పాఠశాల స్థాయిలో నిర్వహించారు. తిరుపతి జిల్లా పరిధిలోని 350ఉన్నత పాఠశాలల నుంచి 8, 9, 10వ తరగతి విద్యార్థులు దాదాపు 18వేల మంది ఈ పరీక్షను రాసినట్లు జేవీవీ జిల్లా కార్యదర్శి రెడ్డెప్ప తెలిపారు.

తరగతుల వారీగా మొదటి స్థానం సాధించిన ముగ్గురు విద్యార్థులను ఒక టీమ్‌గా ఏర్పాటు చేసి ఆ పాఠశాల తరపున అక్టోబరు 1న నిర్వహించే మండల/పట్టణ స్థాయి పోటీల్లో పాల్గొంటారని, ఇక్కడ గెలుపొందిన విజేతలు అక్టోబర్ 27న జిల్లా స్థాయి, అక్కడ గెలుపొందిన వారు నవంబరు 9, 10వ తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ప్రతి ఏటా చెకుముకి సైన్స్ సంబరాల పేరుతో టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు రఫి, లక్ష్మీనారాయణ, బాల, హర్షద్, గణేష్ పాల్గొన్నారు.

పలువురు పోలీసుల సస్పెన్షన్

తిరుపతి క్రైమ్: 2022లో జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించి పలువురు పోలీసులను సస్పెండ్ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. సస్పెండ్ అయిన వారిలో సీఐలు అబ్బన్న, దేవేంద్రకుమార్, ఎస్ఐలు నాగేంద్రబాబు, సుమతి ఉన్నారు.

వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల ఎస్ఎంఎస్ జారీలో అంతరాయం

- సాంకేతిక సమస్యను సరిదిద్దిన ఈడీపీ అధికారులు

తిరుమల: వీఐపీ సిఫారసు లేఖలపై జారీచేసే టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లకు సంబంధించిన ఎస్ఎంఎస్ జారీకి బుధవారం రాత్రి అంతరాయం కలిగింది. సాధారణంగా జేఈవో కార్యాలయంలో సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను జారీచేస్తారు. ఈ మేరకు సదరు భక్తులకు రెఫరెన్స్ నెంబర్ తో కూడిన స్లిప్ జారీచేస్తారు. అనంతరం రాత్రికి భక్తుడికి ఎస్ఎంఎస్ ద్వారా వీఐపీ టికెట్ల సమాచారాన్ని చేరవేస్తారు. భక్తుడు ఎస్ఎంఎస్ ఆధారంగా ఆన్‌లైన్‌లో నగదు చెల్లించి టికెట్ పొందవచ్చు. అనంతరం ఆ టికెట్ ప్రింట్ తీసుకుని దర్శనానికి వెళ్లవచ్చు. అయితే రాత్రి దాదాపు 10 గంటల వరకు భక్తులకు వీఐపీ బ్రేక్ దర్శన టికెట్ల జారీకి సంబంధించిన ఎస్ఎంఎస్‌లు రాకపోవడంతో భక్తులు అదనపు ఈవో కార్యాలయం చేరుకున్నారు. వారికి మాన్యువల్‌గా టికెట్ల సమాచారాన్ని ఇవ్వడంతోభక్తులు ఎంబీసీ 34లో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేశారు. అనంతరం కొంత సేపటికే ఈడీపీ అధికారులు స్పందించి సమస్యను సరిదిద్దడంతో భక్తులకు ఎస్ఎంఎస్‌లు వెళ్లడం మొదలైంది. ఒక్కసారిగా ఎస్ఎంఎస్‌లు పంపే క్రమంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో సకాలంలో అధికారులు స్పందించి పునరుద్ధరించారు.

ఫార్మసిస్ట్ డే అంతర్జాతీయ వెబినార్

తిరుపతి సిటీ: వరల్డ్ ఫార్మసిస్ట్ డే సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ అఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, పద్మావతి మహిళా వర్సిటీ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'సిములేషన్ ఇన్ ఫార్మసీ ఎడ్యుకేషన్ టు ఎన్హాన్స్ ఎక్స్‌పీరియన్షియల్ లెర్నింగ్' అనే అంశంపై బుధవారం అంతర్జాతీయ వెబ్‌నార్ నిర్వహించారు. ఈ వెబ్‌నార్‌లో దుబాయ్‌కి చెందిన ఫార్మసీ కాలేజ్ ఫర్ గరల్స్ క్లినికల్ ఫార్మసీ ప్రాక్టీస్ విభాగం అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ మిర్జా ఆర్ బెయిగ్ ప్రసంగించా రు. ఔషధ పాఠ్యాంశాలలో సిమ్యులేషన్ పద్ధతుల ను ఎలా సమ్మిళితం చేయాలో వివరించారు. వివిధ సిమ్యులేషన్ పరికరాలు, కేస్ స్టడీస్, సాంకేతికతల ను ప్రదర్శించి, ఔషధ విద్యా బోధనలో వాటిని ఎలా అనుసంధించాలో వివరించారు. ప్రొఫెసర్ జోత్స్న రాణి, ఇందిరా ముజీబ్, నాగరాజు పాల్గొన్నారు.

'మాజీ వీసీ సేవలు శ్లాఘనీయం'

తిరుపతి సిటీ: ఎస్వీయూ మాజీ వీసీ, తత్వశాస్త్ర విభాగ ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి శత జయంతి పురస్కరించుకుని బుధవారం వర్సిటీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. 1975–78లో ఎస్వీయూ వీసీగా సేవలు అందించారని, ఆయన ప్రపంచ ప్రసిద్ధి గాంచిన అనేక తత్వశాస్త్ర గ్రంథాలను రచించారని విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం చంద్రయ్య స్మరించారు. సచ్చిదానందమూర్తి బౌద్ధం, ఆచార్య నాగార్జున తత్వశాస్త్రాలపై గొప్ప పట్టు ఉన్న పరిశోధకుడని కీర్తించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసరావు నాయక్, డాక్టర్ ఎన్.దయాకర్, డాక్టర్ కే.జయరామయ్య, మనోవిజ్ఞాన శాస్త్ర విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కే.చంద్రయ్య, పరిశోధకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుమలలో వాహనాల తనిఖీ

– సరైన పత్రాలు లేని ఏడు వాహనాలకు రూ.45,700 జరిమానా

తిరుమల : తిరుమల ట్రాఫిక్ పోలీసులు, తిరుపతి ఆర్టీఓ సంయుక్తంగా బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. స్థానిక జీఎన్‌సీ టోల్‌గేట్ వద్ద చేసిన తనిఖీలలో వాహనాల రికార్డులను, ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సుస్, పొల్యూషన్ రికార్డులను పరిశీలించారు. సరైన రికార్డులు లేని ఏడు వాహనాలకు రూ.45,700 జరిమానా విధించారు. తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ మాట్లాడుతూ, తిరుమల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, సరైన ఫిట్‌నెస్ లేని వాహనాలు ప్రయాణిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేసినట్లు చెప్పారు. ఏడు వాహనాలకు రవాణాశాఖ అధికారులతో కలిసి జరిమానా విధించినట్లు చెప్పారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని చెప్పారు. తనిఖీల్లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వర్మ, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీన్ దయాళ్ జయంతి

తిరుపతి గాంధీ రోడ్: సమాజంలో అట్టడుగు స్థాయి పేద వర్గాలను ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేసిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ అని జిల్లా బీజేపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు గుండాల గోపీనాథ్ రెడ్డి స్మరించారు. దీన్ దయాళ్ 108వ జయంతి సందర్భంగా తిరుపతి ప్రధాన తపాలా కార్యాలయం ఆవరణలో బీజేపీ నాయకులు ఆయ న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. ఆయన జీవితం ఇప్పటి నాయకులకు మార్గదర్శకం అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కట్టమంచి చంద్రబాబు యాదవ్, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, చంగల్ రాయులు, నాదముని, గురునాథ నాయుడు, యువరాజు, పద్మనాభం పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

- నేడు 3కే రన్, వేస్ట్ టూ వండర్ పోటీలు
- కమిషనర్ మౌర్య



మొక్కలు నాటుతున్న కమిషనర్

తిరుపతి తుడా: పరిశుభ్రత– కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా గుర్తెరిగి వ్యవహరిస్తే పరిసరాలు శుభ్రంగా ఉంటాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం సీతమ్మ నగర్ రోడ్డు, వెంకటరమణ లేఔట్‌లోని పార్కులో విద్యార్థులు, మహిళలతో కలసి ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. 15 రోజులపాటు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో భాగంగా పారిశుద్ధ్య పనులు, పార్కుల్లో, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడం, తడి, పొడి చెత్త వేరు చేయడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. గురువారం ఉదయం వివేకానంద కూడలి నుంచి ఎస్వీయూ వరకు మూడు కిలోమీటర్ల రన్, వేస్ట్ టు వండర్ పోటీలు, వీధి నాటికలు, పారిశుద్ధ్య కార్మికులకు కిట్ల పంపిణీ, ఆరోగ్య పరీక్షల నిర్వహణ వంటి పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈ మహేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, మెప్మా కృష్ణవేణి పాల్గొన్నారు

గృహ నిర్మాణంలో తిరుపతి పూర్

- గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వర్లు

తిరుపతి రూరల్: గృహ నిర్మాణాల్లో తిరుపతి అర్బన్, చంద్రగిరి నియోజకవర్గాలు పురోగతి చాలా తక్కువగా ఉందని గృహ నిర్మాణశాఖ పీడీ వెంకటేశ్వర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. తిరుపతి రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన రెండు నియోజకవర్గాల పరిధిలోని లేఔట్ల ప్రత్యేక అధికారులు, గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. మండలాలు, లేఔట్ల వారీగా గృహ నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. తిరుపతి నియోజకవర్గంలో ఇంకా ఏడు వేలకు పైగా ఇళ్లు పునాది దశలోనే ఉన్నాయని, 4,198 ఇళ్లు స్లాబ్ లెవల్‌కు వచ్చినా ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. చంద్రగిరిలోనూ 4వేలకు ఇళ్లు వివిధ స్థాయిలో నిలిచిపోయాయన్నారు. పునాది స్థాయిలో ఉన్న వాటిని 2025 మార్చి నాటికి, రూఫ్ లెవల్లో ఉన్న వాటిని ఈఏడాది అక్టోబర్ నెలఖారు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. మార్చి తర్వాత గ్రాంట్ నిలిచిపోయే ప్రమాదం ఉందని, తర్వాత లబ్ధిదారులకు సబ్సిడీ అందుకోలేరని, దీనిని దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయిల్లో అవగాహన పెంచి నిర్మాణాలు పూర్తి చేయించాలని ఆదేశించారు. సమావేశంలో రూరల్ ఎంపీడీఓ రమేష్‌బాబు, చంద్రగిరి హౌసింగ్ డీఈ శ్రీరాములురెడ్డి, లేఔట్ స్పెషలాఫీసర్ మమత, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భవిత



శిక్షణలో పాల్గొన్న మహిళా వర్సిటీ ప్రొఫెసర్లు, డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ ప్రభావతి

తిరుపతి రూరల్: రైతాంగం ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సుస్థిర భవిషతకు పునాది వేసుకోవచ్చని రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్(రూస) ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ నీరజ అన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన విభాగం, బయో సైన్స్, సెరికల్చర్, న్యాయ విభాగాలు సంయుక్తంగా రూస ప్రాజెక్టులో భాగంగా తిరుపతి రూరల్ మండలం వేమూరు పంచాయతీలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మహిళలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, మహిళలకు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించి, ఉత్పాదకత సామర్థ్యాలను పెంచి, తద్వారా పర్యావరణ సుస్థిరతను, మహిళా సాధికారతను సాధించడమే ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమన్నారు. రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం ఉత్తమమని వర్సిటీ బయోసైన్స్,సెరికల్చర్ విభాగం ప్రొఫెసర్లు సుజాత, సావిత్రి తెలిపారు. ఈ శిక్షణతో మహిళలు పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని ఆర్థిక సుస్థిరత సాధించాలని డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ ప్రభావతి పిలుపునిచ్చారు. ప్రకృతి వ్యవసాయ డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, అడిషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ పట్టాభి రెడ్డి, మాస్టర్ ట్రెయినర్లు అయ్యప్పనాయుడు, నీలమ్మ, రంగయ్య, మహిళలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సన్మానం



అవార్డులు పొందిన ఉపాధ్యాయులను సత్కరించిన బీటీఏ నాయకులు

పాకాల: జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన పలువురి ఉపాధ్యాయులకు స్థానిక ఎస్వీఎస్ పాఠశాల ఆవరణలో బీటీఏ ఘనంగా సత్కరించింది. బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రామమూర్తి అధ్యక్షన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా స్థాయిలో జి.బాలసుబ్రమణ్యం, రూత్‌పావని, మండల స్థాయిలో పి.వెంకటయ్య, పి.రామచంద్రయ్య, సరస్వతిలకు బీటీఏ నాయకులు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సత్కరించారు. విద్యార్థుల భవిష్యత్తుకు, వారి అభివృద్ధికి బాటలు వేసే ఉపాధ్యాయులకు అవార్డులు రావడం సంతోషకరమని కొనియాడారు. కార్యక్రమంలో బీటీఏ జిల్లా అధ్యక్షులు విశ్వనాథం, హెచ్ఎంలు మహమ్మద్ రఫీ, నాగరాజు, బీటీఏ నాయకులు జ్యోతిప్రసాద్, రాష్ట్ర నాయకులు గుండ్లపల్లి ఆంజనేయులు, ఎస్.ఆదికేశవులు, కృష్ణమూర్తి, గోపాలయ్య, రాజేంద్రుడు, తులసీరాం, విజయమోహన్, రెడ్డెప్ప, గోపి, సుబ్బయ్య, వెంకటస్వామి, గణేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



అవగాహన కల్పిస్తున్న మాధవరెడ్డి

తిరుపతి రూరల్: పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలు కూడా రోజు రోజుకూ పెరుగుతున్నాయని, వీటిపై అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ సైబర్ వారియార్ మాధవరెడ్డి అన్నారు. సైబర్ నేరాలపై తిరుపతి రూరల్ మండలం సీ.గొల్లపల్లిలోని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సెల్‌ఫోన్ల వల్ల రోజూ సగటున 2,200 పైచిలుకు సైబర్ దాడులు జరుగుతున్నాయన్నారు. మొబైల్ బ్యాంకింగ్ ద్వారా సైబర్ నేరగాళ్లు, ఆర్థిక వివరాలను సేకరించి దోపిడీ చేస్తున్నారని, ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 18002096789 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ దాడుల నుంచి రక్షణ విధానాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్యాలతో లక్ష్య సాధన



ప్రసంగిస్తున్న నటుడు ప్రదీప్

తిరుపతి సిటీ: విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించాలంటే విద్యతో పాటు నైపుణ్యాలు కలిగి ఉండటం తప్పనిసరని ప్రముఖ నటుడు ప్రదీప్ కొండిపర్తి అన్నారు. బుధవారం స్థానిక కరకంబాడి రోడ్డులోని అన్నమయ్య ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్‌లో చేరిన విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పట్టుదల, కృషి, ఎప్పటికీ వదలని దృక్పథం ప్రతి విద్యార్థి అలవరచుకోవాలన్నారు. భావప్రకటన నైపుణ్యాలు, సమస్య పరిష్కరించే సామర్థ్యం, కృషితోనే లక్ష్యం అందుకోగలరన్నారు. సమావేశంలో చైర్మన్ సి.గంగిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ నాదమునిరెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు.